క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి

శింగనమల: యల్లనూరు మండలం బొప్పేపల్లి గ్రామంలోని సీతారాముల ఆలయ నిర్మాణానికి ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి రూ.లక్ష విరాళంగా అందజేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆ గ్రామానికి చెందిన నారాయణ స్వామి తదితరులకు చెక్కు అందజేశారు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు రూ.లక్ష అందించడంతో గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

చెత్త సేకరణ సక్రమంగా చేయించండి



పారిశుధ్య పనులపై ఆరా తీస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: ఇంటింటా చెత్తసేకరణ సక్రమంగా చేయించాలని మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులకు కమిషనర్ మల్లికార్జున సూచించారు. సోమవారం పట్టణంలోని 30వ వార్డు ఆచారమ్మ కొట్టాలలో శానిటేషన్ సిబ్బందితో కలిసి వార్డులో పర్యటించారు. పారిశుద్ధ్య పనులు ఎలా జరుగుతున్నాయి? రోజూ ఇంటింటా చెత్తసేకరణ జరుగుతుందా? లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. అనంతరం అంజలిన గర్ పార్క్, గుంతబావి వద్ద ఉన్న డిపెప్ భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈ గురప్పయాదవ్, శానిటరీ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

గుంతకల్లుటౌన్: ఈనెల 5న పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బేల్దారి నారాయణ స్వామి అనే వ్యక్తి మరణించిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు మేస్త్రీ దొడ్డప్ప సోమవారం పోలేరమ్మ ఆలయం వద్ద మృతుడి కుటుంబ సభ్యులకు రూ.10 వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

బెంచీల ఏర్పాటుకు విరాళం



చెక్కు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: శ్రీశంకరానంద డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులు కూర్చునేందుకు వీలుగా బెంచీల ఏర్పాటుకు కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎంసీ బాలయ్య విరాళం అందజేశారు. సోమవారం రూ.25 వేల చెక్కును కళాశాల కరస్పాండెంట్ కేసీ హరి, ప్రిన్సిపాల్ గోపాల్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దాతకు కళాశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు.

18న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం

గార్లదిన్నె: మండల పరిధిలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 18న కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీవల్లి, దేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి కల్యాణం జరిపిస్తామని పేర్కొన్నారు.

గేట్స్‌లో 'వాయిస్ ఆఫ్ యూత్' కార్యక్రమం



ప్రధాని మోదీ ప్రసంగాన్ని వింటున్న విద్యార్థులు

గుత్తి: వికసిత్ భారత్ 2047: వాయిస్ ఆఫ్ యూత్ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మోదీ వివరించారు. అంతే కాకుండా ఆర్థిక వృద్ధి, సామాజిక పురోగతి, పర్యావరణ సుస్థిరత, సుపరిపాలన వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గేట్స్ కాలేజీలో విద్యార్థులు మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. కార్యక్రమంలో గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాలుగున్నరేళ్లలో పేదలందరికీ లబ్ధి

- ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారం కోసం ప్రతి గడప గడపకూ వెళ్తున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని 33వ వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. అందరికి సక్రమంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. నాలుగున్నరేళ్ల పాలనలో పేదల ప్రజలకు సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారన్నారు. పార్టీలు, కులమతాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. పేదల అభ్యున్నతికి పాటుపడుతున్న వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బాలరాజు, సునీల్ పేరం ప్రతాప్‌రెడ్డి, అలీ, సూర్యప్రభాకర్ బాబు, కె.నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్దపప్పూరు మండలం ముచ్చుకోటలో సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

రైతన్నల సంక్షేమమే లక్ష్యం

పెద్దపప్పూరు: రైతన్నల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ముచ్చుకోట, వరదాయపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముచ్చుకోటలో ఇటీవల అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకున్న ఈశ్వర్ రెడ్డి, నారాయణమ్మకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. ముచ్చుకోట ప్రాజెక్టును గతంలో ఏ నాయకుడూ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వైఎస్సార్ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముచ్చుకోట, చాగల్లు, పెండేకల్లు ప్రాజెక్టులకు నీరు విడుదల చేయించారన్నారు. గత ప్రభుత్వంలో కేవలం రాజకీయ పలుకుబడి ఉంటేనే సంక్షేమ పథకాలు వర్తించేవన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎలాంటి రాజకీయ పలుకుబడి లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అక్కడి రైతులను అడిగారు. 'ఒకప్పుడు బోరుబావుల్లో నీరులేక ఇబ్బందులు పడ్డాం. అయితే ఈ ప్రభుత్వం ఏర్పాటైన ఈ నాలుగున్నరేళ్లలో వరుసగా ముచ్చుకోట ప్రాజెక్టుకు నీరు విడుదల చేయడంతో బోరుబావుల్లో నీరు సమృద్ధిగా వస్తున్నాయి. బీడుభూములు సైతం సాగులోకి వచ్చాయని రైతన్నలు సంతోషం వ్యక్తం చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎటువంటి సమస్య వచ్చినా వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరామిరెడ్డి, మండల కన్వీనర్ అమర్‌నాథ రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ రామ్మూర్తి రెడ్డి, జిల్లా పార్లమెంట్ జనరల్ సెక్రటరీ రవిప్రసాద్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు హాజీవలి, సీనియర్ నాయకుడు వరదాయపల్లి శివారెడ్డి, సర్పంచ్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

పుట్లూరు: మండల కేంద్రలోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాతల సహాయంతో గత కొంత కాలంగా ప్రతి సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గుంతకల్లుటౌన్: హజరత్ సయ్యద్ మస్తాన్ వలి మైనార్టీ అండ్ వీకర్స్ సెక్షన్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మహబూబ్, జఫ్రుల్లాఖాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కమిటీ ఉపాధ్యక్షులుగా పీర్ బాషా, రవికుమార్, మగ్బుల్, సహాయ కార్యదర్శిగా షేక్షావలిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డులో సోమవారం బైక్ అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. ప్యాపిలికి చెందిన శ్రీనివాసులు, ధరణి బాబు ద్విచక్ర వాహనంలో అనంతపురానికి వస్తుండగా..మార్గంమధ్యలోని గుత్తి శివారులో బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడటంతో వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సీఎం జగనన్నే మళ్లీ రావాలి



తాడిపత్రి పట్టణం నందలపాడులో పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు



బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడులో పథకాలపై అవగాహన



గుంతకల్లు పట్టణం 34వ వార్డులో పథకాల బోర్డు ఆవిష్కరణ..

గుంతకల్లుటౌన్: నవరత్నాల్లాంటి సంక్షేమ పథకాలను అమలు చేసి పేద ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలను మెరుగుపరిచిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని తెలిపారు. సోమవారం పట్టణంలోని 34వ వార్డు కౌన్సిలర్ సుమోబాషా ఆధ్వర్యంలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. సచివాలయం బయట పార్టీ పతాకాన్ని ఎగురవేసి వందనం చేశారు. అనంతరం సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి 98 శాతం హామీలను అమలు చేసిన ఘనత జగనన్నదేనన్నారు. నియోజకవర్గం చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, సంక్షేమాలు జరిగాయని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు ఆర్‌డీజీ.బాషా, ఆసిఫ్, జేసీఎస్ కన్వీనర్లు జింకల రామాంజనేయులు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రిటౌన్: సంక్షేమ ప్రభుత్వానికి మరోసారి పట్టం కడదాం అని జెడ్పీటీసీ రమణమ్మ అన్నారు. మండలంలోని గంగాదేవిపల్లి గ్రామంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ఓబులరెడ్డి గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. గత ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు డబ్బు డిమాండ్ చేసేవాళ్లని తెలిపారు. చంద్రబాబు మోసాలను ఎండగట్టారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నేరుగా ఇంటికే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతరెడ్డి, ఎంపీటీసీ గంగిరెడ్డి, కన్వీనర్ పల్లె నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి అర్బన్: పేదల అభ్యున్నతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూదేకుల బాబయ్య పేర్కొన్నారు. సోమవారం స్థానిక నందలపాడులో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబయ్య మాట్లాడుతూ.. పేదరికమే అర్హతగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. నవరత్నాల్లోని పథకాలే కాక ఇతర పథకాలను అందజేసి పేదల కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల కోసం పరితపిస్తున్న జగన్ననకు మళ్లీ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో



తాడిపత్రి మండలం గంగాదేవిపల్లిలో జెండా ఎగురవేస్తున్న ప్రజాప్రతినిధులు

వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జావిద్‌ఖాద్రీ, వక్ఫ్‌బోర్డు కార్యదర్శి బాబా, నాయకులు సుబ్బారెడ్డి, సునీల్, గణేష్, తులసి, రవి పాల్గొన్నారు.

కొర్రపాడులో..

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని కొర్రపాడు సచివాలయంలో సోమవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ.. జగనన్న పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. కొర్రపాడు సచివాలయం పరిధిలో రూ. 27.25 కోట్ల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ అంకే నరేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరి రమణారెడ్డి, కొర్రపాడు భాస్కర్‌రెడ్డి, రాధా మనోహర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, ఆగ్రోస్ రామక్రిష్ణారెడ్డి, ఎస్సీసెల్ నాయకులు గంగరాజు పాల్గొన్నారు.

అమ్మా.. పింఛన్ అందుతోందా?

తాడిపత్రిటౌన్: అమ్మా పింఛన్ అందుతోందా.. మరోసారి జగనన్నను ఆశీర్వదించండి అంటూ ఎమ్మెల్యే తనయుడు, యువనేత కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి వృద్ధులను ఆప్యాయంగా పలకరించారు. సోమవారం మండలంలోని తిప్పారెడ్డిపల్లి, కొట్టాలపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగాలన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను , కేతిరెడ్డి పెద్దారెడ్డిని గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఫించన్ తీసుకునేందుకు ఇబ్బందులు పడేవాళ్లమని, జగనన్న ప్రభుత్వంలో నేరుగా వలంటీర్లు ఇంటి వద్దకే వచ్చి ఫించన్ ఇస్తున్నారని ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరామిరెడ్డి, ఎంపీటీసీ శేఖర్‌నాయుడు, కన్వీనర్ పల్లె నాగేశ్వరెడ్డి, కాశీ, వీరనారాయణరెడ్డి, హరీష్, హాజీవలి, అశ్వత్థ తదితరులు పాల్గొన్నారు.



మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న కేతిరెడ్డి సాయిప్రతాప్‌రెడ్డి

స్థలాన్ని కాపాడాలని వినతి

గుత్తి రూరల్: మునిసిపాలిటీ పరిధిలోని గుత్తి ఆర్ఎస్‌లో ఈద్గా పక్కన ఉన్న స్థలాన్ని కొందరు ఆక్రమించుకునేందుకు యత్నిస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని గుత్తి ఆర్ఎస్ సున్నీ రోషన్ మసీదు, ఈద్గా కమిటీ సభ్యులు కోరారు. సోమవారం పట్టణంలోని కార్యాలయంలో తహసీల్దార్ మహబూబ్ బాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సున్నీ రోషన్ మసీదు కమిటీ కార్యదర్శి నబీరసూల్ మాట్లాడుతూ.. గుత్తి ఆర్ఎస్ పత్తికొండ రోడ్డులో సర్వే నంబర్ 259లో ఈద్గా మైదానం పక్కన ఉన్న ఐదు సెంట్ల భూమిని 2008 అక్టోబర్ 10న మసీదు కమిటీ ద్వారా కొనుగోలు చేశామన్నారు. అయితే స్థల యజమాని అదే స్థలాన్ని సుగుణమ్మ అనే మహిళకు విక్రయించాడు. ఈ విషయం తెలియడంతో అతడిని ప్రశ్నించగా.. రద్దు పరచారన్నారు. ప్రస్తుతం తమ స్థలంలో ఈద్గా కమిటీ ప్రహరీ నిర్మిస్తుండగా ఆ స్థలం తమదని సుగుణమ్మ కోడలు భారతి అడ్డుపడుతోందని వివరించారు. స్థలానికి సంబంధించిన ఆధారాలు చూపించాలని కోరగా ఆమె పట్టించుకోకుండా పనులను అడ్డుకుంటోందని తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో సున్నీ రోషన్ మసీదు సభ్యులు జీఎం.బాషా, జిలాన్, బషీర్, ఖాజాఖాన్, అయూబ్, మస్తాన్, ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న ఈద్గా కమిటీ సభ్యులు

నేడు గంగమ్మ జాతర

యల్లనూరు: మండలంలోని ఎన్కే కాల్వ రోడ్డులో ఉన్న గంగమ్మ ఆలయం వద్ద మంగళవారం జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని సూచించారు.

ఎస్ఆర్ఐటీలో 'ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం'



కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్లు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఏఐసీటీఈ సహకారంతో అటల్ ఏఐసీటీఈ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ ప్రాయోజిత ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ అధ్యక్షత వహించారు. మద్రాస్ ఐఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ అప్పాజీరావు హాజరై మాట్లాడారు. అధ్యాపకులు నూతన సాంకేతిక టెక్నాలజీని ఉపయోగించుకుని విద్యను అందించాలన్నారు. ప్రస్తుతం ట్రెండ్‌లో ఉన్న సస్టైనబుల్ కన్‌స్ట్రక్షన్ స్థిరమైన నిర్మాణ పరిశ్రమలు, ప్రాముఖ్యత ఐఓటీ అప్లికేషన్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రఘుబాబు, టీపీఓ డాక్టర్ రంజిత్‌రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ హెచ్ఓడి వెంకటరెడ్డి, అనంతపురం జేఎన్‌టీయూ ప్రొఫెసర్ డాక్టర్ మమత, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రామాల్లో ఎమ్మెల్యే పెద్దారెడ్డి పర్యటన

యాడికి: మండలంలోని కోనుప్పలపాడు, ఓబుళాపురం గ్రామాల్లో మంగళవారం ఉదయం 10 గంటలకు తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తరలిరావాలని కోరారు.

క్రీడాకారులకు వరం 'ఆడుదాం-ఆంధ్రా'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



పామిడి ఎంపీడీఓ కార్యాలయంలో ఆడుదాం-ఆంధ్రా క్రీడా సామగ్రి పంపిణీ

పామిడి: ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమం క్రీడాకారులకు వరంగా మారిందని వైఎస్సార్‌సీపీ ఐటీవింగ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఆడుదాం–ఆంధ్రా కార్యక్రమ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు అవసరమన్నారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, పీడీ నరేష్, రమేష్, ప్రసాద్, సుంకన్న, ఉపన్యాసకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


క్రీడా సామగ్రి అందజేత

పామిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆడుదాం–ఆంధ్రాకు సంబంధించిన క్రీడా సామగ్రిని 18 సచివాలయాలకు అందజేశారు. ఆడుదాం – ఆంధ్రా పోటీలకు నమోదు చేసుకునేందుకు ఈనెల 13వ తేదీ వరకూ గడువు ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఎంపీపీ భోగతి మురళీమోహన్ రెడ్డి, పట్టణ కన్వీనర్ జోజుడే కుమార్, ఈశ్వర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, బద్రీనాయక్ పాల్గొన్నారు.

ఆలయాల్లో కార్తీక కాంతులు



తాడిపత్రి బుగ్గ రామలింగేశ్వర ఆలయంలో సహస్ర దీపాలు వెలిగించిన మహిళలు



పెద్దవడుగూరు: కాశేపల్లిలో అలంకరణలో శివలింగం



కసాపురం కాశీ విశ్వేశ్వరాలయంలో రుద్రాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లో సోమవారం కార్తీకమాస ఘనంగా జరిగాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో శైవ క్షేత్రాలు కిక్కిరిశాయి. భక్తుల శివనామ స్మరణతో ఆలయాల ప్రాంగణాలు మార్మోగాయి. కసాపురం కాశీ విశ్వేశ్వరాలయంలో మహన్యాస పూర్వక ఏకాదశవార రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. బుగ్గరామలింగేశ్వరునికి క్షీరాభిషేకం చేశారు. మహిళలు ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి, మొక్కులు చెల్లించుకున్నారు.

– సాక్షినెట్‌వర్క్:



కసాపురంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక వనభోజనాల సందడి



కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు

తాడిపత్రి అర్బన్: స్థానిక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో సోమవారం బలిజ కులస్తుల ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డిని బలిజ సంఘం అధ్యక్షుడు కల్లూరు శ్రీనివాసులు సత్కరించారు. వనభోజన మహోత్సవం సందర్భంగా కళ్యాణ మండపంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఉసిరి చెట్టు కింద భోజనాలు చేశారు.

చేనేత క్లస్టర్‌లో కొత్త వారికి అవకాశం కల్పించాలి

యాడికి: మండల కేంద్రంలోని చేనేత క్లస్టర్‌లో ఉన్న పాత వారిని తొలగించి కొత్తవారికి అవకాశం కల్పించాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు, సీపీఐ నాయకుడు బండారు రాఘవ కోరారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ ఆనందబాబు ఆచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో వ్యవసాయం తర్వాత చేనేతపై ఎక్కువ ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులను క్లస్టర్‌లోని సభ్యులు దోచుకుని అన్యాయం చేశారన్నారు. గతంలో తొలగింపబడిన స్వార్థపరులు తిరిగి చేనేత క్లస్టర్‌ను ప్రారంభించాలని చూస్తున్నారన్నారు. చేనేత క్లస్టర్‌లో పాత వారిని అలాగే కొనసాగిస్తే భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు.

ప్రైవేట్ హాస్టళ్లు మూసి వేయించాలి

గుంతకల్లుటౌన్: ప్రభుత్వ అనుమతి లేకుండా పలు ప్రైవేట్ స్కూళ్లల్లో నిర్వహిస్తున్న హాస్టళ్లను మూసి వేయించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకట్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయా ప్రవేట్ హాస్టల్స్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు కిశోర్, చందూ, షమీర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.